ఊటీ, కొడైకెనాల్ వెళ్లాలంటే ఈ-పాస్ తప్పనిసరి

రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం

చెన్నై, మే 7: వేసవి విడిది కేంద్రాలైన ఊటీ, కొడైకెనాల్ వెళ్లేందుకు ఈ-పాస్ తప్పనిసరి చేసిన నేపథ్యంలో ఇందుకు సంబంధించి రిజిస్ట్రేషన్, ఈ-పాస్ వినియోగం ప్రారంభమయ్యాయి. పర్యాటకులు, వ్యాపారులు తమ వివరాలను ‘epass.tnega.org’ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసి ఈ-పాస్ పొందవచ్చు. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ ప్రారంభమైంది. మద్రాస్ హైకోర్టు ఆదేశాల మేరకు 7వ తేదీ నుంచి ఈ-పాస్ తప్పనిసరి అని గతంలో తమిళనాడు ప్రభుత్వం ప్రకటించింది. పర్యాటకులు తమ వివరాలు, వాహనాల నంబరు, వచ్చే రోజు..మొదలైన వివరాలను ఆన్‌లైన్ ద్వారా వెల్లడించి ఈ-పాస్ పొందాల్సి ఉంటుంది. ఈ విధానం జూన్ 30 వరకు మాత్రమే అమల్లో ఉంటుందని తమిళనాడు ప్రభుత్వం వెల్లడించింది.

మరింత కొత్తగా గూగుల్ మ్యాప్స్

మ్యాప్‌లు మెరుగ్గా కనిపించేలా రీడిజైన్

లాస్ ఏంజెల్స్, మే 7: వినియోగదారులకు మ్యాప్‌లు మరింత మెరుగ్గా కనిపించేలా ‘మ్యాప్స్’ యాప్‌ను గూగుల్ రీడిజైన్ చేస్తున్నది. ఇందులో భాగంగా కొన్ని మార్పుచేర్పులు చేస్తున్నది. ఇప్పటివరకు మనం మ్యాప్స్‌లో ఏదైనా ప్రదేశాన్ని సెర్చ్ చేసినప్పుడు, దానికి సంబంధించిన మ్యాప్‌తో పాటు ఫొటోలు, సమాచారం కూడా కనిపిస్తున్నది. సగం స్క్రీన్‌లో ఇవే ఉండటం వల్ల మ్యాప్ సరిగ్గా కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో కొత్తగా మ్యాప్‌కు ఎలాంటి అడ్డంకులు లేకుండా డిజైన్ చేస్తున్నది. పాప్ అప్, మెనూ వంటివి ఏవీ మ్యాప్‌కు అడ్డుగా రాకుండా, మ్యాప్‌లు స్పష్టంగా కనిపించేలా మారుస్తున్నది. ఇక, ఇప్పటివరకు ఎక్కడికైనా వెళ్లేందుకు స్టార్టింగ్ లొకేషన్, డెస్టినేషన్ అడ్రస్ ఎంటర్ చేయడానికి మాత్రమే ఆప్షన్ ఉండేది. ఇక మీదట అడ్రస్ ఎంటర్ చేస్తున్నప్పుడే కింద డ్రైవింగ్, ప్రజా రవాణా, వాకింగ్, టాక్సీ, సైకిల్ వంటి ఆప్షన్లు కనిపిస్తాయి.

షావోమీ, రెడ్‌మీ, పోకో ఫోన్లలో ప్రమాదకర వైరస్

వ్యక్తిగత డాటా భద్రతకు ముప్పు

న్యూఢిల్లీ, మే 7: షావోమీ ఫోన్లతో పాటు ఈ కంపెనీకి చెందిన రెడ్‌మీ, పోకో స్మార్ట్‌ఫోన్‌లలో ప్రమాదకర వైరస్‌ను సైబర్ సెక్యూరిటీ నిపుణులు గుర్తించారు. ఈ వైరస్ వల్ల వినియోగదారుల వ్యక్తిగత డాటా హ్యాకర్ల చేతికి చిక్కే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ ఫోన్‌లలో ఏప్రిల్ 25 నుంచి ఏప్రిల్ 30 మధ్య దాదాపు 20 భద్రతాపరమైన లోపాలు, సమస్యలను సైబర్ సెక్యూరిటీ నిపుణులు గుర్తించారు. ఈ వివరాలను ఓవర్‌సెక్యూర్డ్ అనే బ్లాగ్‌లో ప్రచురించారు. ఎంఐయూఐ, హైపర్‌ఓఎస్ వినియోగించే ఫోన్లలో ఈ సమస్యలు ఉన్నట్టు పేర్కొన్నారు. షావోమీ ఓపెన్ సోర్స్ ప్రాజెక్ట్ యాప్(ఏఓఎస్‌పీ)లలో లోపాలు ఉన్నాయని, వీటిని వెంటనే సరిచేయాలని తెలిపారు. ఈ భద్రతాపరమైన లోపాల గురించి చైనాకు చెందిన షావోమీ సంస్థ ఇప్పటివరకు ఎలాంటి వివరాలు వెల్లడించలేదు.

2024లో తీవ్ర ఎండలు

- 1901 తర్వాత తొలి ఐదు అత్యంత తీవ్ర ఉష్ణోగ్రత సంవత్సరాల్లో ఇదొకటి
- దేశ ఎన్నికలపై ప్రభావం

హైదరాబాద్, మే 7 (నమస్తే తెలంగాణ): ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో 2024వ సంవత్సరం చరిత్రలోనే తొలి ఐదు అత్యంత తీవ్ర ఉష్ణ సంవత్సరాల్లో ఒకటిగా నిలువనున్నది. ఏప్రిల్ నెలలో ముందస్తు రుతు పవనాల జల్లులు, ఉరుములతో కూడిన వర్షాలు లేకపోవడంతో భారత దక్షిణ ద్వీపకల్పంలో 1901 తరవాత ఐదో అత్యంత తక్కువ వర్షపాతం నమోదైంది. సూపర్ ఎల్‌నినో ప్రభావంతో 2023 జూన్ నుంచి 10 నెలలుగా ప్రతినెలా రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని తన అధ్యయనంలో తేలినట్టు అమెరికాకు చెందిన క్లైమేట్ సెంట్రల్ సంస్థ తాజాగా వెల్లడించింది. ఏప్రిల్ మాసం అత్యంత వేడి మాసంగా రికార్డులకు ఎక్కిందని చెప్పింది. ప్రస్తుతం దేశంలో జరుగుతున్న అభ్యర్థుల ప్రచారం, ఓటింగ్‌పై వాతావరణ మార్పుల ప్రభావం ఉందని తెలిపింది.

ప్రపంచంలో సగం జనాభా దేశాల్లో ఈ ఏడాదిలో ఎన్నికలు

ఈ సంవత్సరంలో ప్రపంచంలోని 49 శాతం జనాభా గల 64 దేశాల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నా 90 కోట్ల మందికి పైగా ప్రజలు ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు.

25 వేల టీచర్ల నియామకాల రద్దుపై స్టే

మమత సర్కారుకు సుప్రీంలో ఊరట

న్యూఢిల్లీ: పశ్చిమ బెంగాల్‌లో ఇటీవల నియమితులైన బోధన, బోధనేతర ఊరట లభించింది. వారి నియామకం చెల్లదంటూ కలకత్తా హైకోర్టు ఇచ్చిన తీర్పుపై మంగళవారం సర్వోన్నత న్యాయస్థానం స్టే విధించింది. అయితే ఈ కేసు దర్యాప్తును కొనసాగించడానికి సీబీఐకి అనుమతి ఇవ్వడమే కాక, దర్యాప్తుకు అవసరమైతే రాష్ట్ర మంత్రి వర్గ సభ్యులను కూడా విచారించవచ్చునంటూ సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్‌లు జేబీ పార్థీవాలా, మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి ఊరటనిచ్చిన సుప్రీం కోర్టు దర్యాప్తులో భాగంగా అధికారులు, ఉద్యోగాలు పొందినవారిని, అనుమానితులను అరెస్ట్ చేయవద్దంటూ సీబీఐని ఆదేశించింది.

సునీతా విలియమ్స్ రోదసి యాత్ర నిలిపివేత

కేప్ కెనావెరల్: భారత సంతతి అమెరికా వ్యోమగామి సునీతా విలియమ్స్ చేపట్టాల్సిన మూడో రోదసి యాత్ర చివరి నిమిషంలో ఆగిపోయింది. బోయింగ్ సంస్థ ‘స్టార్‌లైనర్’ వ్యోమనౌకలో సునీతాతోపాటు మరో వ్యోమగామి బచ్ విల్మోర్‌ను అంతరిక్షంలోకి తీసుకెళ్లాల్సిన ‘అట్లాస్’ రాకెట్‌లో సోమవారం రాత్రి వాల్వ్‌కు సంబంధించిన సమస్య తలెత్తడమే ఇందుకు కారణం. భారత కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం 8 గంటల 4 నిమిషాలకు ఈ రాకెట్ నింగిలోకి దూసుకెళ్లాల్సి ఉన్నది. దీనికి రెండు గంటల ముందు ‘అట్లాస్’ రాకెట్ ఎగువ దశలోని ఆక్సిజన్ ప్రెజర్-రిలీఫ్ వాల్వ్ పనితీరు సక్రమంగా లేదని గుర్తించడంతో ప్రస్తుతానికి ఈ ప్రయోగాన్ని నిలిపివేసినట్టు యునైటెడ్ లాంచ్ అలయెన్స్ కంపెనీ సీఈవో టోరీ బ్రునో వివరించారు.

ఐదోసారి రష్యా అధ్యక్షుడిగా పుతిన్

- మరో ఆరేండ్లపాటు పదవిలో
- గత 25 ఏండ్లుగా అధికారం
- స్టాలిన్ తర్వాత అత్యధిక కాలం అధ్యక్షుడిగా ఘనత



మాస్కో, మే 7: రష్యా అధ్యక్షునిగా వ్లాదిమిర్ పుతిన్ మంగళవారం ఐదోసారి ప్రమాణ స్వీకారం చేశారు. అధికార అధ్యక్ష భవనం క్రెమ్లిన్ ప్యాలెస్‌లో సుమారు 2500 మంది అతిథుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో పుతిన్ రష్యా రాజ్యాంగంపై చేయి ఉంచి, పదవీ ప్రమాణం చేశారు. అమెరికా సహా పలు పశ్చిమ దేశాలు ఈ కార్యక్రమానికి హాజరు కాలేదు.

అత్యధిక కాలం పాలించిన నేత

ఇప్పటికే 25 ఏండ్ల పదవీ కాలాన్ని పూర్తి చేసుకున్న పుతిన్.. జోసఫ్ స్టాలిన్ తర్వాత అత్యధిక కాలం రష్యాను పరిపాలించిన నేతగా నిలువనున్నారు. అధ్యక్షుడు బోరిస్ ఎల్టిసిన్ తర్వాత పుతిన్ అధ్యక్షుడు లేదా ప్రధానిగా 1999 నుంచి ఈ పదవిలో ఉన్నారు 2030తో పదవీకాలం ముగిసిన తర్వాత కూడా ఆయన తదుపరి ఎన్నికలలో పోటీ చేసేందుకు అర్హుడే. మార్చిలో జరిగిన ఎన్నికల్లో ఆయనకు పెద్దగా పోటీనిచ్చే విపక్ష నేత లేకపోవడంతో మరోసారి ఘన విజయం సాధించారు.

పలు సవాళ్లు

ప్రపంచ దేశాలలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా రష్యాను తీర్చిదిద్దుతానని 2018లో అధికారం చేపట్టినప్పుడు పేర్కొన్న పుతిన్ దానిని నిలుపుకోలేక పోయారు. రెండేండ్ల క్రితం ఉక్రెయిన్‌తో యుద్ధంతో నిధులు ఎక్కువ మొత్తం యుద్ధంపైనే వెచ్చించడంతో ఆ దేశ ఆర్థిక వ్యవస్థ ఇబ్బందుల్లో పడింది.

ఎన్నో వివాదాలు

మార్చిలో జరిగిన ఎన్నికల్లో పుతిన్ ఘన విజయం సాధించారు. అప్పట్లో అతని ప్రధాన ప్రత్యర్థి అయిన అలెక్సీ నావల్నీ ఎన్నికలకు నెలకు ముందు హఠాత్తుగా మరణించారు. మరికొంతమందిని జైలుకు పంపగా, మరికొందరిని బలవంతంగా విదేశాలకు పంపారన్న ఆరోపణలున్నాయి. రష్యా ప్రైవేట్ సైన్యం అధినేత ప్రిగోజిన్.. పుతిన్‌పై తిరుగుబాటు చేయడం, విమాన ప్రమాదంలో అతను అనుమానాస్పద స్థితిలో మరణించడంతో పుతిన్‌పై పలు విమర్శలొచ్చాయి.

జెలెన్‌స్కీ హత్యకు కుట్ర!

కీవ్: ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, ఇతర ఉన్నతాధికారుల హత్యకు రష్యా పన్నిన కుట్రను ఉక్రెయిన్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ భగ్నం చేసినట్టు ఉక్రెయిన్ సెక్యూరిటీ సర్వీస్ మంగళవారం వెల్లడించింది. అధ్యక్షుడు జెలెన్‌స్కీ సహా మిలిటరీ ఇంటెలిజెన్స్ హెడ్ క్రైరోలో బుడనోవ్, ఎస్‌బీయూ చీఫ్ వాసిల్ మాల్యుక్ తదితరులు ఈ హిట్ లిస్టులో ఉన్నారని తెలిపింది. దేశాధినేతను పట్టుకుని చంపించాలనుకుందని, దానిలో భాగంగా, జెలెన్‌స్కీ భద్రతకు దగ్గరగా ఉన్న మిలిటరీలోని బలమైన నేరస్థులను కనుగొనడం రష్యా గూఢచారి సంస్థ ఫెడరల్ సెక్యూరిటీ సర్వీస్ లక్ష్యంగా పెట్టుకుందని ఉక్రెయిన్ అధికారి ఒకరు తెలిపారు. అయితే దానిని సమర్థవంతంగా తిప్పికొట్టినట్టు చెప్పారు. యుద్ధం ప్రారంభయ్యాక తనపై కనీసం ఐదుసార్లు హత్యా యత్నాలు జరిగాయంటూ జెలెన్‌స్కీ గతంలో వెల్లడించారు.

మోసపూరిత ప్రకటనలకు సెలబ్రిటీలూ బాధ్యులే

సుప్రీంకోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ: మోసపూరిత, తప్పుదోవ పట్టించే ప్రకటనల విషయంలో ప్రచారం చేసిన సెలబ్రిటీలు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు కూడా బాధ్యత వహించాల్సి ఉంటుందని సుప్రీంకోర్టు పేర్కొన్నది. పతంజలి తప్పుదోవ పట్టించే ప్రకటనల కేసును జస్టిస్ హిమా కోహ్లి, జస్టిస్ అమానుల్లా ధర్మాసనం మంగళవారం విచారించింది. తప్పుదోవ పట్టించే ప్రకటనల నియంత్రణ, సమర్థన-2022 నిబంధనల్లోని 13వ నిబంధనల ప్రకారం ఏదైనా వస్తువు లేదా సేవలను ప్రచారం చేసేటప్పుడు వాటి గురించి ప్రచారం చేసే వ్యక్తికి పూర్తి సమాచారం ఉండాలని, మోసపూరిత ప్రకటనలు కాదని నిర్ధారించుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నది. మార్కెట్ నుంచి కొనే వస్తువులు, ముఖ్యంగా ఆహారం, ఆరోగ్యానికి సంబంధించిన వాటిపై వినియోగదారులకు అవగాహన ఉండాలని ఈ నిబంధనలు రూపొందించారని కోర్టు తెలిపింది.

ముడతలు మంచివే!

- సోమవారం ఐరన్ చేయని దుస్తులు ధరించండి
- ఉద్యోగులకు సీఎస్ఐఆర్ సూచన
- పర్యావరణ పరిరక్షణకు నిర్ణయం

న్యూఢిల్లీ, మే 7: పర్యావరణ పరిరక్షణ కోసం ‘ముడతలు మంచివే’ అంటున్నది శాస్త్ర, సాంకేతిక పరిశోధన మండలి(సీఎస్ఐఆర్). ఇందుకోసం ప్రతి సోమవారం ఆ సంస్థ సిబ్బంది ఇస్త్రీ చేయని దుస్తులు ధరించి ఆఫీసులకు వస్తున్నారు. వాతావరణ మార్పులపై పోరాటం చేసేందుకు ‘స్వచ్ఛత పక్వాడ’లో భాగంగా ఈ నెల 1-15 తేదీల మధ్య ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రతి సోమవారం తాము వేసుకొనే దుస్తులను ఇస్త్రీ చేయకుండా ఉండటం ద్వారా విద్యుత్తును పొదుపు చేస్తున్నారు. దేశవ్యాప్తంగా సంస్థ అన్ని ప్రయోగశాలలు, పని ప్రదేశాల్లో విద్యుత్తును పొదుపు చేయడం ద్వారా కరెంటు బిల్లును 10% తగ్గించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. దీన్ని ఈ ఏడాది జూన్-ఆగస్ట్ మధ్యలో అమలు చేయనున్నారు. విద్యుత్తు పొదుపు కోసం తాము చేపట్టిన చొరవ ద్వారా వాతావరణ మార్పులపై ప్రజల్లో అవగాహన పెంచుతామని సీఎస్ఐఆర్ అధికారులు తెలిపారు. అతి చిన్న విషయాలు కూడా ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పుల వల్ల కలిగే దుష్ఫలితాలను తగ్గించేందుకు ఎలా దోహదపడతాయో ప్రజలకు వివరిస్తామని వారు చెప్పారు.

భర్త ప్రైవేట్ పార్ట్స్‌ను సిగరెట్‌తో కాల్చి చిత్రహింసలు

వేరు కాపురం పెట్టలేదని భార్య దుశ్చర్య

బిజ్నూర్: వేరు కాపురం పెట్టలేదనే కోపంతో యూపీలోని ఒక మహిళ తన భర్త ప్రైవేట్ పార్ట్స్(లైంగిక అవయవాలు)ను సిగరెట్‌తో కాల్చి చిత్ర హింసకు గురి చేసింది. బాధితుడి ఫిర్యాదు మేరకు ఈ నెల 5న బిజ్నూర్ జిల్లా పోలీసులు నిందితురాలిపై కేసు నమోదు చేసి ఆమెను అరెస్ట్ చేశారు. తనకు డ్రగ్స్ ఇచ్చి తన భార్య మెహర్ జహాన్ ఈ దాడికి పాల్పడిందని బాధితుడు మనన్ జైదీ వాపోయాడు. ఇందుకు సాక్ష్యంగా సీసీటీవీ ఫుటేజీని పోలీసులకు అందించాడు. నిందితురాలు భర్త ఛాతిపై కూర్చొని అతడి గొంతు నొక్కడం, లైంగిక అవయవాలను సిగరెట్‌తో కాల్చడం సీసీటీవీలో రికార్డయ్యాయి. గతంలోనూ తన భార్య తనపై ఈ విధంగా భౌతిక దాడి చేసిందని జైదీ తెలిపాడు. ఏడాది క్రితం తమకు పెండ్లయ్యిందని.. అప్పటి నుంచి వేరు కాపురం పెట్టాలని తన భార్య తనను వేధిస్తున్నదని బాధితుడు పోలీసులకు తెలిపాడు.

కేరళలో మళ్లీ ‘వెస్ట్ నైల్’ వైరస్

తిరువనంతపురం, మే 7: కేరళలో ‘వెస్ట్ నైల్’ వైరస్ కేసులు మళ్లీ వెలుగు చూస్తున్నాయి. త్రిస్సూర్, మలప్పురం, కొజికోడ్ జిల్లాల్లో తాజాగా ‘వెస్ట్ నైల్’ ఫీవర్ కేసులు నమోదైనట్టు కేరళ ప్రభుత్వం మంగళవారం ప్రకటించింది. దీంతో అప్రమత్తంగా ఉండాలని అన్ని జిల్లాలకు ఆదేశాలు జారీ చేసింది. క్యూలెక్స్ దోమలతో ఈ జ్వరాలు వస్తున్నాయని, వీటి నివారణకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టాలని అందులో సూచించారు.

ట్రంప్‌తో లైంగిక సంబంధాలు నిజమే

శృంగార తార వాంగ్మూలం

వాషింగ్టన్, మే 7: ‘హష్ మనీ’ కేసులో అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు మరో షాక్ తగిలింది. డొనాల్డ్ ట్రంప్ అతని హోటల్ సూట్‌లోని బెడ్‌పై సెక్స్‌లో పాల్గొన్నట్టు అడల్ట్ స్టార్ స్మార్మీ డేనియల్స్ మంగళవారం కోర్టులో వాంగ్మూలం ఇచ్చారు. ఆ సమయంలో ట్రంప్ కండోమ్ వాడారా? అని అడిగిన ప్రశ్నకు, ‘లేదు’ అని డేనియల్స్ సమాధానమిచ్చారు. ట్రంప్‌తో 2006నాటి లైంగిక సంబంధాన్ని కోర్టుకు వివరించారు. ఆమెతో శారీరక సంబంధం 2016 ఎన్నికల ప్రచార సమయంలో బయటకు రాకుండా అనైతిక ఒప్పందం చేసుకున్నారనే ఆరోపణల్ని ట్రంప్ ఎదుర్కొంటున్నారు. ఈ కేసులో ట్రంప్‌పై కోర్టులో క్రిమినల్ నేరారోపణలు నమోదయ్యాయి.

తక్షణమే బరాజ్‌లకు మరమ్మతులు!

- గేట్లన్నీ తెరచి.. సీపేజీలను అరికట్టాలి
- 7వ బ్లాక్‌లో రాఫ్ట్ కిందనున్న కేవిటీలను పూడ్చాలి
- దెబ్బతిన్న సీసీ బ్లాక్‌ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలి
- మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల రక్షణకు ఎన్డీఎస్ఏ సిఫారసులు



హైదరాబాద్, మే7 (నమస్తే తెలంగాణ): వానకాలంలో బరాజ్‌లకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ఉండేందుకు గేట్లన్నీ తెరిచిపెట్టాలని, దెబ్బతిన్న, కొట్టుకుపోయిన సీసీ బ్లాక్‌లను రిప్లేస్ చేయాలని ఇరిగేషన్‌శాఖకు నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నియమించిన నిపుణుల కమిటీ సూచించింది. వానాకాలంలోగానే సిఫారసులను అమలు చేయాలని, ఆ మేరకు నిధులు, డ్రాయింగ్‌లను సమకూర్చుకోవాలని స్పష్టంచేసింది. మేడిగడ్డ (లక్ష్మీ) బరాజ్ 7వ బ్లాక్‌లోని 20వ పిల్లర్ కుంగుబాటు, అన్నారం (పార్వతీ), సుందిళ్ల (సరస్వతీ) బరాజ్‌ల్లో సీపేజీలపై సాంకేతిక అధ్యయనం చేసి, చేపట్టాల్సిన పునరుద్ధరణ పనులను, తీసుకోవాల్సిన నివారణ చర్యలను సిఫారసు చేయాలని కోరుతూ తెలంగాణ ప్రభుత్వం నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీకి (ఎన్డీఎస్ఏ)కి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలో ఎన్డీఎస్ఏ ప్రత్యేక నిపుణుల కమిటీని నియమించి నాలుగు నెలల్లో నివేదికను అందజేయాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో సదరు కమిటీ మార్చి 6,7,8,9 తేదీల్లో, ఆ తరువాత 20,21,22 తేదీల్లో రాష్ట్రంలో పర్యటించింది. స్వయంగా వెళ్లి 3 బరాజ్‌లను క్షేత్రస్థాయిలో పరిశీలించడంతో, నిర్మాణ ఏజెన్సీలు, భాగస్వాములైన అధికారులతోనూ భేటీ అయ్యింది. బరాజ్‌ల నిర్మాణ డిజైన్లు, తదితర డాక్యుమెంట్లను ఇరిగేషన్ అధికారులను అడిగి తీసుకున్నది. ఇరిగేషన్‌శాఖ విజ్ఞప్తి మేరకు బరాజ్‌ల రక్షణకు తీసుకోవాల్సిన చర్యలను అధికారులకు సూచిస్తూ తాజాగా నిపుణుల కమిటీ మధ్యంతర మార్గదర్శకాలను జారీ చేసింది. నిపుణుల కమిటీ సిరఫాసులను ఎన్డీఎస్ఏ చైర్మన్ అనిల్‌జైన్ రాష్ట్ర సాగునీటిపారుదలశాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జాకు పంపించారు. మేడిగడ్డ బరాజ్‌ను 2019 జూన్‌లో ప్రారంభించారని, నాటి నుంచి నీటిని నిల్వచేస్తున్నారని, ఆ మొదటి సంవత్సరం వచ్చిన వరదలకే బరాజ్ దిగువనున్న సీసీ బ్లాక్‌లు, ఆప్రాన్ దెబ్బతిన్నాయని, వాటికి వెంటనే మరమ్మతులు చేపట్టకుండా యథావిధిగా బరాజ్‌లో నీటినిల్వ చేసి ఉపయోగించారని, ఇదే కుంగుబాటునకు కారణమని కమిటీ వెల్లడించింది.

నిపుణుల కమిటీ మధ్యంతర సిఫార్సులు

కుంగుబాటుకు గురైన 7వ బ్లాక్‌కు గురించి: మేడిగడ్డ బ్యారేజీలోని 85 రేడియల్ గేట్లలో 77 గేట్లు యథావిధిగా పనిచేస్తున్నాయి.కుంగుబాటునకు గురైన 7వ బ్లాక్‌లోని 15 నుంచి 22 వరకు ఉన్న 8 రేడియల్ గేట్లు లిఫ్ట్ చేయాల్సి ఉంది. రానున్న రుతుపవనాల ప్రారంభానికి ముందే ఆ పనులు ముగించాలి.

- మేడిగడ్డ బరాజ్‌లోని 7వ బ్లాక్‌లో ఏర్పడిన పగుళ్లను సాంకేతికంగా పర్యవేక్షించాలి.
- 16-22 వరకు పిల్లర్లు వంగి ఉన్న నేపథ్యంలో పగుళ్లు ఏర్పడే అవకాశమున్నది. పగుళ్ల నివారించేందుకు నిర్దేశిత ప్రదేశాల్లో బ్రేసింగ్ సిస్టమ్‌తో అనుసంధానించాలి.
- 7వ బ్లాక్‌లో కుంగుబాటును పర్యవేక్షించేందుకు బ్లాక్‌లోని ప్రతి పిల్లర్‌పైన డౌన్‌స్ట్రీమ్, అప్‌స్ట్రీమ్ చివరల్లో, మధ్యలో ఆప్టికల్ టార్గెట్లను ఏర్పాటు చేయాలి.
- కుంగుబాటునకు గురై, దెబ్బతిన్న అప్‌స్ట్రీమ్, డౌన్ స్ట్రీమ్ ఫ్లింత్ స్లాబ్‌ను తీసివేసి, నదీ ప్రవాహ మార్గానికి కావాల్సిన నిర్దేశిత స్థాయికి సమం చేయాలి. ఫ్లింత్ స్లాబ్ చివరలు దెబ్బతింటే వాటిని మరమ్మతు చేయాలి. సీపేజీలు ఉన్నట్లయితే పారామెట్రిక్ జాయింట్ పద్ధతిలో పునరుద్ధరించి వాటిని అరికట్టాలి. 7వ బ్లాక్‌లో రాఫ్ట్ కుంగుబాటుకు గురైన చోట ఇసుక బస్తాలను వేయాలి.
- 7వ బ్లాక్‌కు సంబంధించిన అన్ని గేట్లను రుతుపవనాల ప్రారంభానికి ముందే పూర్తిగా తెరిచి పెట్టాలి. ప్రతీ గేట్ నిర్వహణకు సంబంధించిన వైర్ రోప్, స్టాప్ లాగ్‌లు, గ్యాంట్రీ క్రేన్ మొదలైన మెకానిజం మొత్తాన్ని పూర్తిగా తనిఖీ చేయాలి. బ్లాక్ నెంబర్ 7లోని 15-22 గేట్లు తెరుచుకోని నేపథ్యంలో వాటిని పూర్తిగా తొలగించాలి.
- గాంట్రీ క్రేన్‌ను బ్లాక్ నం7పై కాకుండా మరేదైనా బ్లాక్ వద్ద పార్క్ చేయాలి.
- పిల్లర్ నెంబర్ 20, 21 ఉన్న రేడియల్ గేట్లను కత్తిరించి పూర్తిగా తొలగించాలి.
- మిగిలిన 6 గేట్లను పూర్తిగా తెరిచి ఉంచాలి. ఎత్తడంలో ఇబ్బంది ఏర్పడితే పూర్తిగా తీసివేయాలి.
- బ్లాక్-7 ప్లింత్ స్లాబ్ దిగువన మొదటి మూడు వరుసల్లో ఉన్న సీసీ బ్లాక్‌లు కొట్టుకుపోకుండా ఉండేందుకు వాటిని ఒకదానితో ఒకదాన్ని అనుసంధానించాలి.

1-6, 8 బ్లాక్‌లు, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లకు సంబంధించి: మేడిగడ్డ బ్యారేజ్‌లోని 1-6,8 బ్లాక్‌ల సంరక్షణకు, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల రక్షణకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై నిపుణుల కమిటీ వేర్వేరుగా సిఫారసు చేసింది. ఇంచుమించి ఒకే తరహా నివారణ చర్యలను సూచించింది.

భవిష్యత్ అధ్యయనాలపై మార్గదర్శకాలు:

- మేడిగడ్డ బరాజ్ కుంగుబాటుకు, ఇతర బరాజ్‌ల్లోని సమస్యలకు కారణాలను తెలుసుకునేందుకు, నిర్మాణ సమగ్రతను అంచనా వేయడానికి తదుపరి అధ్యయనాలు పరిశోధనలు చేయాల్సి ఉంది. జియోఫిజికల్, జియోటెక్నికల్ పరీక్షలను రుతుపవనాల ప్రారంభానికి ముందే నిర్వహించాలి.
- IS కోడ్ 13578 నిబంధనల ప్రకారం ఉపరితల పరిశోధనలు నిర్వహించాలి.
- పై పరీక్షలన్నింటినీ సీఎస్ఎంఆర్ఎస్, సీడబ్ల్యూపీఆర్ఎస్, ఎన్‌జీఆర్ఐ హైదరాబాద్ వంటి సంస్థలతో చేయించాలి.

అమలుకాని హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్

మాజీ గవర్నర్ తమిళిసై

హైదరాబాద్, మే 7 (నమస్తే తెలంగాణ) : అమలుకాని హామీలిచ్చి, అబద్ధపు ప్రచారాలు చేసి తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని రాష్ట్ర మాజీ గవర్నర్, బీజేపీ మహిళా నేత తమిళిసై సౌందర్ రాజన్ అన్నారు. మంగళవారం ఆమె బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ నేతలకు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలిసి కూడా అబద్ధపు హామీలు ఇచ్చారని, ఇప్పుడు రుణమాఫీ ఎలా చేస్తారని ప్రశ్నించారు. తాను సౌత్ చెన్నైలో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు.

‘కోరుట్ల’ ఘటనలో డాక్టర్ శ్రవణ్ సస్పెన్షన్

హైదరాబాద్, మే 7 (నమస్తే తెలంగాణ): కోరుట్ల ఏరియా దవాఖానలో రోగి మరణించిన ఘటనలో ప్రభుత్వం వైద్యుడిని సస్పెండ్ చేసింది. తమ దర్యాప్తులో నిర్లక్ష్య వైద్యం కారణంగానే నజీబర్‌రెహ్మాన్ అనే రోగి మరణించాడని నిర్ధారించినట్టు టీవీవీపీ కమిషనర్ అజయ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు డ్యూటీ డాక్టర్ వీ శ్రవణ్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తున్నట్టు ఉత్తర్వులు జారీ చేశారు. కాగా వైద్యుడిని సస్పెండ్ చేయడాన్ని ఖండిస్తూ తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం మంగళవారం హైదరాబాద్ కోఠిలోని టీవీవీపీ ప్రధాన కార్యాలయం ఎదుట నిరసన తెలిపింది. వెంటనే సస్పెన్షన్‌ను ఎత్తివేయకుంటే అన్ని వైద్య సంఘాలతో చర్చించి కార్యాచరణ రూపొందిస్తామని హెచ్చరించింది.

మేడిగడ్డ బరాజ్‌ను పరిశీలిస్తున్న జ్యుడీషియల్ కమిషన్ చైర్మన్ రిటైర్డ్ జస్టిస్ పినాకి చంద్ర ఘోష్

మేడిగడ్డను పరిశీలించిన చంద్రఘోష్ కమిషన్

వివరాలు సేకరించిన కమిషన్, నిపుణుల బృందం

మహదేవపూర్, మే 7: కాళేశ్వరంప్రాజెక్ట్ పరిధిలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండల పరిధిలోని అంబట్‌పల్లి గ్రామంలో ఉన్న మేడిగడ్డ (లక్ష్మీ) బరాజ్‌ను మంగళవారం జ్యుడీషియల్ కమిషన్ సందర్శించింది. కమిషన్ చైర్మన్, రిటైర్డ్ జస్టిస్ పినాకి చంద్ర ఘోష్, ఇరిగేషన్ కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, నిపుణుల బృందం, కలెక్టర్ భవేశ్‌మిశ్రా, ఎస్పీ కిరణ్ ఖరేతో కలిసి బరాజ్‌ను పరిశీలించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై న్యాయ విచారణలో భాగంగా బరాజ్‌లోని కుంగుబాటుకు గురైన 19, 20, 21వ పియర్లలతోపాటు ఏడో బ్లాక్‌లో వంతెనపై కాలినడకన వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించారు. ఏడో బ్లాక్‌లో దెబ్బతిన్న పియర్ల ప్రాంతాన్ని పరిశీలించి అధికారుల నుంచి వివరాలు సేకరించారు. బరాజ్‌లో కుంగిన పియర్ల పగుళ్లను పరిశీలించారు. కుంగుబాటుకు గల కారణాలను, ఇతర సాంకేతిక అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ జస్టిస్ పినాకి చంద్రఘోష్ మాట్లాడుతూ.. ఎన్డీఎస్ఏ నివేదిక ఆదివారమే అందిందని, దాన్ని అధికారుల సమక్షంలో సమీక్షిస్తున్నట్టు తెలిపారు. వీరి వెంట ఓఅండ్ఎం జనరల్ అనిల్, ఓఅండ్ఎం ఈఎన్‌సీ నాగేందర్‌రావు, సీఈ సుధాకర్‌రెడ్డి, క్వాలిటీ కంట్రోల్ సీఈ వెంకటకృష్ణ, ఈఈ తిరుపతిరావు, ఎల్ అండ్‌టీ ప్రాజెక్ట్ మేనేజర్ రజనీష్, నిపుణులు, అధికారులు ఉన్నారు.

ఖాళీ బిందెలతో మహిళల నిరసన

ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలోని పొన్నారి గ్రామంలో ఎస్సీ కాలనీకి చెందిన మహిళలు మంగళవారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. రెండు రోజులుగా తాగునీరు సరఫరా కాకపోవడంతో విసుగు చెందిన మహిళలు గ్రామ పంచాయతీ ఎదుట బైఠాయించారు. మంచినీరు అందించాలని గ్రామ కార్యదర్శిని నిలదీశారు. దీంతో కాలనీలో తాగునీటి సమస్య రాకుండా చూస్తానని, వెంటనే నీటి ట్యాంకర్‌తో మంచినీరు అందించామని పంచాయతీ కార్యదర్శి బండి విజయ్‌కుమార్ తెలిపారు. -తాంసి

రేవూరికి మంత్రి కొండా ధమ్కీ

- పరకాల కాంగ్రెస్‌లో వర్గపోరు
- ఓడిపోయేటోన్ని గెలిపించినం..
- నా మాట వినాల్సిందే : మంత్రి
- ధమ్కీ ఇస్తే చూస్తూ ఊరుకోను..
- మీ ఇష్టమైంది చేసుకోండి :ఎమ్మెల్యే
- ఫోన్‌లో వాగ్వాదం.. ఆడియో వైరల్

పరకాల, మే 7 : పరకాల కాంగ్రెస్‌లో వర్గపోరు రోజురోజుకూ ముదురుతున్నది. మంత్రి కొండా సురేఖ వర్గం వర్సెస్ ఎమ్మెల్యే రేవూరి వర్గం మధ్య వాగ్వాదాలు జరిగి రోడ్డెక్కి కేసులు నమోదైన ఘటనలు ఉండగా తాజాగా మంత్రి సురేఖ, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మధ్య ఫోన్లో వాగ్వాదం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నది. వరంగల్ జిల్లా గీసుగొండ మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు రడం భరత్ విషయంలో మంత్రి సురేఖ ఎమ్మెల్యే రేవూరికి ఫోన్లో ధమ్కీ ఇవ్వడంపై చర్చ జరుగుతున్నది. ‘గీసుగొండ నా సొంత మండలం.. ఇక్కడ జరిగే ప్రతి కార్యక్రమం, ప్రతి చేరిక నాకు తెలియాలి. నాకు తెలియకుండా ఏమైనా జరిగినా ఊరుకునేది లేదు. ఇటీవల మేము పార్టీలోకి ఆహ్వానించి పార్టీ కండువా కప్పిన భరత్‌ను పార్టీలో క్రియాశీలకంగా ఉంచుకోవాలి. ఇప్పుడు మాకు నచ్చని వారిని ప్రోత్సహిస్తే ఊరుకునేది లేదు. ఎంపీపీ సౌజన్య, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి ఊసరవెల్లులు. వారు పార్టీని నాశనం చేశారు. వారిని సంకలో పెట్టుకుని రాజకీయాలు చేయడం మంచిది కాదు. పార్టీకి నష్టం చేస్తేనే రాజ్‌కుమార్‌ను పార్టీ నుంచి పంపించాం. రాజ్‌కుమార్‌ను పార్టీలోకి తీసుకుని లీడర్‌ను చేస్తాననడం మమ్మల్ని అవమానించినట్టే. ఓడిపోయే మిమ్మల్ని పరకాలలో గెలిపించినం. మేము చెప్పినట్టు వినాలి’ అంటూ సురేఖ ధమ్కీ ఇచ్చారు.

గట్టిగానే సమాధానమిచ్చిన రేవూరి..

ఎమ్మెల్యే రేవూరి ఫోన్‌లోనే మంత్రి సురేఖకు గట్టిగానే సమాధానమిచ్చారు. తనకు భరత్ పద్ధతి నచ్చలేదని, అందుకే వ్యతిరేకిస్తున్నట్టు స్పష్టం చేశారు. నాకు ధమ్కీ ఇస్తున్నావా? అని కొండాకు రేవూరి ఎదురుతిరిగారు. మీరు మాట్లాడే విధానం బాగాలేదు. మీరేం మాట్లాడుతున్నారో తెలుస్తున్నదా? రికార్డు కావాలంటే పంపిస్తా.. ఏం మాట్లాడుతున్నరో మీరే ఆలోచించుకోండి. మినిస్టర్ గారు ఒక్క విషయం నేను ఫోన్ పెట్టేయడం సంస్కారం అనిపిస్తలేదు. అర్థం చేసుకోండి’ అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

కాంగ్రెస్ నేత సంభాని రాకను నిరసిస్తూ సత్తుపల్లిలో ధర్నా చేస్తున్న ఎమ్మెల్యే వర్గీయులు

‘సంభాని గో బ్యాక్’

సత్తుపల్లి కాంగ్రెస్‌లో రోడ్డెక్కిన వర్గపోరు • మాజీ మంత్రి రాకను అడ్డుకున్న ‘మట్టా’

సత్తుపల్లి టౌన్, మే 7: సత్తుపల్లి నియోజకవర్గ కాంగ్రెస్‌లో వర్గాల లొల్లి మొదలైంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌ను వీడిన నేతలు.. ఆ పార్టీ అధికారంలోకి వచ్చాక మళ్లీ చేరారు. దీంతో వర్గపోరు బహిర్గతమైంది. కొత్తగా పార్టీలో చేరిన వారికి, సత్తుపల్లి ఎమ్మెల్యే దయానంద్ వర్గీయులకు సఖ్యత కుదరడంలేదు. జగ్గారెడ్డి సమక్షంలో మాజీ మంత్రి చంద్రశేఖర్ ఇటీవల తన వర్గీయులతో కాంగ్రెస్‌లో చేరారు. కాకర్లపల్లిలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశానికి చంద్రశేఖర్‌ను రానీయకుండా ఎమ్మెల్యే వర్గీయులు నిరసనకు దిగారు. రోడ్డుపై ధర్నా చేపట్టి ‘సంభాని.. గో బ్యాక్’ అంటూ నినాదాలు చేశారు.